సాక్షి తిరుపతి

సోమవారం ၊ 4 ၊ సెప్టెంబర్ ၊ 2023



మీటరు గిర్రున తిరుగుతోంది

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. 50 లక్షల యూనిట్ల వరకు అదనంగా వాడుతున్నారు. - 8లో



తప్పెవరిది అమ్మా?

పలమనేరులో ఓ మహిళ పుట్టిన బిడ్డను మురుగు కాలువలో పడేయడం చర్చనీయాంశమైంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	25
చిత్తూరు	31	24
తిరుమల	26	20
గూడూరు	31	26
నగరి	32	25

న్యూస్‌రీల్

సంకట చతుర్థి పూజలు



హోమపూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద ఆదివారం ఆగమోక్తంగా సంకట చతుర్థి పూజలు నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునే విధంగా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్జిత సేవగా తీసుకొచ్చారు. ఆదివారం అంజి అంజి వినాయకస్వామి ఆలయం వద్ద అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్: తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి విభాగానికి చెందిన ఉన్నతాధికారి తప్పకుండా హాజరుకావాలన్నారు. అదేవిధంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి రోజూ సాయంత్రం తప్పనిసరిగా స్పందన వినతులు స్వీకరించాలని చెప్పారు. మీ పరిధిలో పరిష్కారం చేయగలిగిన సమస్యలను స్వతరమే పరిష్కరించాలని సూచించారు. అర్జీలను రాయడానికి ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్‌ఏలను ఏర్పాటు చేశామని చెప్పారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి వర్క్‌షాప్


తిరుపతి కల్చరల్: టీటీడీకి చెందిన శ్రీవేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థలో ఈనెల 4వ తేదీ సోమవారం నుంచి 6వ తేదీ వరకు సంప్రదాయ ఆలయ శిల్పకళలు–అనుబంధ అంశాలపై దక్షిణ భారతదేశంలోని నిష్ణాతులైన స్థపతులు, ఆగమ పండితులతో మూడు రోజుల పాటు వర్క్‌షాపు జరుగనుంది. ఆలయ నిర్మాణం, శిల్పాల తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు, ఆసక్తి గల ఇతర విద్యార్థులకు ఈ వర్క్‌షాప్‌లో మెలకువలు తెలియజేయడంతో పాటు పలు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు మొదటి రోజు శిల్పశాస్త్రాల ప్రకారం ఆలయం, గోపురాల నిర్మాణంలో సాంకేతిక అంశాలు అనే అంశంపై, లోహ శిల్ప తయారీ విధానంలో సాంకేతిక అంశాలపై, ఆలయాలు, శిల్పాలపై 3డీ విజువలైజేషన్ అనే అంశాలపై ప్రముఖ స్థపతులు, ఆగమశాస్త్ర పండితులు ప్రసంగిస్తారు. రెండవ రోజు శిల్పశాస్త్రాల ప్రకారం ప్రతిమా లక్షణం, భారతీయ సంప్రదాయ చిత్రకళ, రాతిశిల్పం తయారీలో సాంకేతిక అంశాలు, పురాతన ఆలయాలలో పురాణ కథల శిల్పాలు అనే అంశాలపై పలువురు నిష్ణాతులు ప్రసంగిస్తారు. అలాగే మూడవ రోజు 6వ తేదీన దారు శిల్పం తయారీలో సాంకేతిక అంశం, హంపిలోని విజయనగర రాజుల కాలం నాటి ఆలయ శిల్పకళ, వేదాలు, ఆగమాలు, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, ఆలయాలు, శిల్పాలపై 3డీ విజువలైజేషన్ అనే అంశాలపై పండితులు ప్రసంగించనున్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు సోమవారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశాలు జరుగుతాయని చెప్పారు. ఒకటి, ఏడు, రెండు, నాలుగు స్థాయి సంఘాల సమావేశాలు ఉదయం 10 గంటలకు, మూడు, ఐదు, ఆరు స్థాయి సంఘాల సమావేశాలు మధ్యాహ్నం 2 నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతాయని తెలిపారు.

అజాగ్రత.. మితిమీరిన దురలవాట్లు.. డబ్బుంటే ఏ వ్యాధి అయినా నయం అవుతుందనే ధీమా.. వెరసి మనిషి జీవితాన్ని నాశనం చేస్తోంది. ఫలితంగా నిద్ర లేవగానే ముద్ద కంటే ముందు మందు బిళ్లలు తినాల్సి వస్తోంది. ఫలితంగా ఫార్మసీ వ్యాపారం జోరందుకుంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రోజూ రూ.16 కోట్ల పైనే వ్యాపారం సాగుతోంది. మితిమీరిన మాత్రల వాడకం వల్ల కొత్త జబ్బులు కొనితెచ్చుకోవాల్సి వస్తుందని వైద్య యంత్రాంగం హెచ్చరిస్తోంది. ఆరోగ్య నియమాలు పాటిస్తే జబ్బులన్నీ అదుపులోకి వస్తాయని సూచిస్తోంది.

మింగేస్తున్నారు!



భోజనానికి ముందు మింగే కొన్ని మాత్రల వివరాలు

మాత్రల రకం	సంఖ్య(రోజువారీ)
పాంటో ప్రజోల్	1,50,000
ఒమెప్రజోల్	1,75,000
లాన్సోప్రజోల్	1,50,000
రానిటిడిన్	1,60,000
ఎసోమెప్రజోల్	1,30,000
లాన్స్‌ప్రజోల్	1,50,000
రాబెప్రజోల్	1,70,000

- భోజనానికి ముందు మాత్రలు మింగుతున్న జనం
- బీపీ, మధుమేహం, గుండె, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులే అధికం
- పెరిగిన వినియోగం
- జోరుగా సాగుతున్న ఫార్మసీ వ్యాపారం
- రూ.కోట్లల్లో ఆదాయం

తినక ముందు వాడాల్సిన మందులు

- బీపీ
- షుగర్
- థైరాయిడ్
- పేగు సమస్యలు
- శ్వాస సంబంధిత వ్యాధులు
- అల్సర్
- రక్త సంబంధిత వ్యాధులు
- గుండె సంబంధిత వ్యాధులు
- నోటి సమస్యలు
- జీర్ణాశయ వ్యాధులు



సాక్షి తిరుపతి: జీవనశైలిలో మార్పులు మనిషి జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. ఆహార నియమాలు పాటించకపోవడం, చెడు అలవాట్లు బానిసకావడంతో వ్యాధులు కబళిస్తున్నాయి. ఆరోగ్య సూత్రాలపై అవగాహన లేని కారణంగా విచ్చలవిడిగా మాత్రలు మింగేస్తున్నాయి. జనం తిండికంటే ముందు పరకడుపున మాత్రలను తీసుకోవాల్సి వస్తోంది. ఈ రకమైన మాత్రలు వాడే వారి సంఖ్య ఇటీవల కాలంలో గణనీయంగా పెరుగుతోంది. ఫలితంగా ఫార్మసీ వ్యాపారం జిల్లాలో మూడు మందు బిల్లులు..ఆరు ఇంజెక్షన్లుగా విరాజిల్లుతోంది. దీంతో మందుల వ్యాపారం రూ. కోట్లల్లో సాగుతున్నట్లు డ్రగ్స్, వైద్య నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచింగ్ ఆస్పత్రులు 2, ఒక జిల్లా ఆస్పత్రి 1, ఏరియా ఆస్పత్రులు 7, సీహెచ్‌సీలు 15, పీహెచ్‌సీలు 108, ప్రైవేటు ఆస్పత్రులు 4 వేలకు పైగా ఉన్నాయి. వీటి పరిధిలో నిత్యం 25 వేలకుపైగా ఓపీలు వస్తుంటాయి. ఇందులో అధికంగా బీపీ, మధుమేహం, గుండె, కడుపుమంట, శ్వాస సంబంధిత సమస్యలకు సంబంధించిన వారే అధికంగా వస్తుంటారు. ఎన్‌సీడీ సర్వే ఆధారంగా 2,03,175 బీపీ కేసులు, 2,45,812 మధుమేహ కేసులు, 2401 మందికి గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే కిడ్నీ బాధితులు 4,365 మంది, శ్వాస సంబంధిత సమస్యలు 12,365 మందికి ఉన్నట్లు ఓపీల ఆధారంగా అధికారులు గుర్తించారు. ఇలాంటి వ్యాధుల నివారణకు తినకముందే మాత్రలు వాడకం పరిపాటిగా మారింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ రకమైన మాత్రలు వాడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ విస్తరిస్తోంది. అన్నం తినకముందే తినే మాత్రల అమ్మకాలు నిత్యం దాదాపు రూ. 2 కోట్లు ఉండవచ్చని ఫార్మసీ సంఘం నాయకులు చెబుతున్నారు.

పొద్దునే మింగాల్సిందే...

జబ్బులు చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. ప్రధానంగా బీపీ, మధుమేహం, శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధింత వ్యాధులు అధికంగా పట్టి పీడిస్తున్నాయి.ఈ వ్యాధులున్న వారి సంఖ్య పెరగడంతో మందులు, మాత్రల వినియోగం ఉమ్మడి జిల్లాలో గణనీయంగా పెరుగుతోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులకు సుమారు రూ. 8 కోట్లు విలువ చేసే మాత్రలు, మందులను అందజేస్తోంది. ఇక ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రతిరోజు రూ.8 కోట్ల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు ఫార్మసీ నిర్వాహకులు చెబుతున్నారు. ఇందులో భోజనం తినకముందే తినే మాత్రలు అధికంగా అమ్ముడుపోతున్నాయి. ఉదయం నిద్ర లేవగానే టీ, కాఫీ, అల్పాహారానికి బదులు కొన్ని రకాల మాత్రలను వినియోగిస్తున్నట్లు గుర్తించి, ఆ రకమైన మాత్రలను భారీగా అమ్మకానికి తెచ్చిపెడుతున్నారు. ముద్ద మింగక ముందే మింగే మందు బిళ్లల వ్యాపారం ప్రైవేటు షాపులో సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇకపోతే యాంటీ బయోటిక్ మాత్రలను పరకడుపున అధిక మోతాదులో మింగేస్తున్నారు. ఈ యాంటీ బయోటిక్ మాత్రల అమ్మకాలు జోరందుకుంటున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా చాలా మంది షాపు కెళ్లి మాత్రలు కొని, మింగుతున్నారు. దీంతో మరికొన్ని జబ్బులను కొన్ని తెచ్చుకోవాల్సి వస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



రోగికి మందులు ఇస్తున్న వైద్యసిబ్బంది

జాగ్రత్తలు పాటించకపోతే....

అందరికీ ఆరోగ్య సూత్రాలు తెలుసు. కానీ పాటించే వారు కనీసం రెండు శాతం మంది కూడా లేరు. చిన్న చిన్న అజాగ్రత్తలతో ఎంతో మంది అనారోగ్యం పాలవుతున్నారు. అజాగ్రత్తకు తోడు వైద్య శాస్త్రం పురోగమించింది. కొత్త కొత్త ఖరీదైన మందులెన్నో వచ్చాయి. ఆధునాతన ఆపరేషన్లు పుట్టుకొచ్చాయి. మంచి సదుపాయాలున్న ఆస్పత్రులు ఉన్నాయి. డబ్బుంటే చాలు, అన్నీ తగ్గించుకోవచ్చనే ధీమా పెరిగిపోతోంది. ఆరోగ్య సూత్రాలు పాటించకపోవడంతో నిద్రలేమి సమస్య, దురలవాట్లతో గుండెపోటు, పక్షవాతం వస్తాయి. మాదక ద్రవ్యాల వ్యసనంతో కొలస్ట్రాల్ సమస్య, జంక్‌పుడ్‌తో రక్తంలో కొలెస్ట్రాల్ పెరుగుతోంది.

మాత్రలతో ముప్పు..



ముక్క లేకుండా ముద్ద దిగడం లేదనే రోజులు పోయాయి. ఇప్పుడు మాత్రలు లేకుండా ముద్ద దిగడం లేదనే రోజులొచ్చాయి. ఇందుకు కొన్ని జబ్బులే ప్రధానం. ఆరోగ్య నియమాలు పాటించకపోవడంతోనే జబ్బులను కొన్ని తెచ్చుకోవాల్సిన దుస్థితి వస్తోంది. కచ్చితంగా ఆరోగ్య సూత్రాలు పాటించాలి. బయటి ఫుడ్‌కు అలవాటు పడకూడదు. డాక్టరు సలహాలు, సూచనలు లేకుండా మాత్రలు మింగకూడదు. నొప్పులు వెంటనే తగ్గాలని పెయిన్ కిల్లర్స్‌కు అలవాటు పడితే..అది మిమ్మల్ని చంపేస్తాయి. తర్వాత కిడ్నీ, గ్రాస్టిక్ సమస్యలను తెచ్చుకోవడం ఖాయం. జాగ్రత్తలు పాటించి మాత్రల ముప్పు నుంచి బయట పడాలి.

– డాక్టర్ రవిరాజు, వైద్య నిపుణులు

కళలకు కాణాచి తిరుపతి

- అసమాన అభివృద్ధితో కొత్త తిరుపతి ఆవిష్కృతం
- నాలుగేళ్లలో వందలాది కోట్లతో నగరం అభివృద్ధి
- కచ్చపి ఆడిటోరియం ప్రారంభోత్సవంలో టీటీడీ చైర్మన్ భూమన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ గురుమూర్తి మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్లు

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక నగరం తిరుపతి గడిచిన నాలుగేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించిందని, నగరానికి శోభను తీసుకొచ్చే ఎన్నో కార్యక్రమాలను చేపట్టడం ద్వారా కొత్త తిరుపతి ఆవిష్కృతం అవుతుందని తిరుపతి శాసనసభ్యులు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అన్నారు. తిరుపతి స్మార్ట్ సిటీలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కచ్చపి ఆడిటోరియం, సుకృతి కళానిలయాన్ని ఆదివారం తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, నగర మేయర్ డాక్టర్ శిరీష, స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ సరస్వతీ దేవి వీణ పేరు అయిన కచ్చపి పేరును ఎంపిక చేయడం వెనుక తిరుపతి కళలకు కాణాచిగా విరాజిల్లాలన్న ఆలోచనతోనే పెట్టామన్నారు. తిరుపతి నగరంలో 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీ లెఫ్టులు, రోడ్ల విస్తరణ పనులు ఉద్యమ తరహాలో చేపట్టామన్నారు. వందలాది కోట్లతో నగర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధితో పాటు ప్రజలకు ఆధునిక సౌకర్యాలను కల్పిస్తున్నామని తెలిపారు. గొప్పగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో తిరుపతి ముందు వరుసలో ఉండడం సంతోషకరమన్నారు. తిరుపతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు నిరాధార, అసత్య ఆరోపణలు గుప్పిస్తున్నారని, ఈ మాటలు వారికి రాజకీయంగా నష్టం చేకూర్చుతాయే తప్ప ఎలాంటి లబ్ధి చేకూరదన్నారు. మేము చేసిన మంచిని చెప్పేందుకే ప్రజల ముందుకు వస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో భక్తితో పాటు సంగీత, సాహిత్య, బహు కళా నగరంగా తిరుపతి ఆవిష్కృతం అవుతుందని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్‌ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, ఎంఈ చంద్రశేఖర్, డీఈఈలు దేవిక, విజయ్‌కుమార్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాలసుబ్రమణ్యం, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్కే బాబు, స్థానిక కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవల్లిక రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అశేష సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

గతంలో ఎప్పుడూ చూడలేదు..

తిరుపతిలో ఒకేసారి 18 మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఇంటర్నల్ రోడ్లను అభివృద్ధి చేయడం హర్షణీయమని ఎంపీ గురుమూర్తి అన్నారు. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి సంగీత, సాహిత్య, సంప్రదాయ కళలు, క్రీడల పోషకులని కొనియాడారు. మేయర్ శిరీష మాట్లాడుతూ నగర అభివృద్ధితో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ కౌన్సిల్ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తిరుపతి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, మున్సి పల్ కమిషనర్ హరిత మాట్లాడుతూ రూ.41 కోట్లతో 600 మంది కూర్చునే విధంగా కచ్చపి ఆడిటోరియం నిర్మించామన్నారు.



కళాకారుల నృత్యం



క్లాసికల్ డ్యాన్సర్ డాక్టర్ పద్మజ రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ గురుమూర్తి



విద్యుత్ కాంతులీనుతున్న కచ్చపి ఆడిటోరియం

19 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న తుమ్మలగుంట శ్రీకల్యాణ వెంకన్న ఆలయం

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. తుమ్మలగుంటలోని ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులతో ఆయన సమీక్షించారు. తిరుమల తరహాలో స్వామివారికి ఎక్కడా లోటు లేకుండా ఉత్సవాలు నిర్వహించాలని ఆదేశించారు. వేలాదిమంది భక్తులు వాహన సేవలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాకుండా ఏపీతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉందని, అందుకు తగినట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. బ్రహ్మోత్సవ కళ ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలని సూచించారు.

ప్రారంభమైన ఏర్పాట్లు..

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈనెల 19వ తేదీ నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంతో పాటు వాహన మండపం పరిసరాల్లో పెయింటింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారి వెంబడి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన స్వాగత బ్యానర్లు, విద్యుత్ ఆర్చీలను ఏర్పాటు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన నేతలు



ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం రేణిగుంట మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు సుమారు వందమంది మణికంఠారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటూ ప్రజాసంక్షేమ పథకాలు తీసుకువచ్చి ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తుండడంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అనునిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజాసేవ చేస్తున్నాడన్నారు. 30 ఏళ్లలో శ్రీకాళహస్తిలో చేయలేని అభివృద్ధిని ఈ నాలుగేళ్లలో ఎమ్మెల్యే చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో బియ్యపు మధుసూదన్‌రెడ్డిని అఖండ మెజారిటీతో మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో ప్రకాష్, శివశంకర్, గిరిశంకర్, సిద్దులు, వెంకీ, మణికంఠారెడ్డి, బాలాజీ, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో చైర్మన్‌కు అభినందనలు



ఇస్రో చైర్మన్ సోమనాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట: ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్‌ను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తదితరులు ఆదివారం శాలువలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ ఒక నెల వ్యవధిలో చంద్రుడి మీద పరిశోధనలకు చంద్రయాన్–3, సూర్యుడి మీద అధ్యయనం చేయడానికి సూర్యయాన్–1 పేరుతో ఆదిత్య ఎల్1 ప్రయోగాలను విజయవంతం చేయడం గొప్పవిషయమన్నారు. భారతదేశం గర్వపడేలా ప్రయోగాలు చేసి విజయాలను సాధించి ప్రపంచ పఠంలో భారత్‌కు ఒక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిన ఘనత ఇస్రో శాస్త్రవేత్తలకు దక్కుతుందన్నారు. శాస్త్రవేత్తలను నడిపించి ప్రయోగాలను సక్సెస్ చేయడంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్ పాత్ర అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌యాదవ్, వైస్ చైర్మన్లు పోలూరు పద్మా మిల్టన్, చిన్ని సత్యనారాయణ, పార్టీ నాయకులు అల్లూరు రమేష్‌రెడ్డి, జెట్టి వేణుయాదవ్, మీజూరు రామకృష్ణారెడ్డి, తుపాకుల ప్రసాద్, అలవల సురేష్, వాసు మొదలి, బద్దెపూడి మోహన్‌రెడ్డి, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఏడుగంగమ్మల ఆలయ ఆధునీకరణపై సమీక్ష


గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడి వీధిలో వెలసిన ఏడుగంగమ్మల ఆధునీకరణ పనులపై ఆదివారం ఆలయ పరిపాలన భవనంలో సమావేశం జరిగింది. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతూ రూ.40 లక్షలు వెచ్చించి ఆధునీకరణ, కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబరులో జాతర రానున్న నేపథ్యంలో ప్రముఖ వేదపండితులు సింగరాజు ప్రకాశం శాస్త్రితో చర్చలు జరిపి ఏం చేయాలో తెలుసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయానికి రెండు నందుల వితరణ


నందులను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి విజయవాడకు చెందిన వల్లభనేని సుధాకర్ చౌదరి, కుటుంబ సభ్యులు ఆదివారం రూ.8 లక్షలు విలువ చేసే రెండు నందులను వితరణ చేశారు. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతలకు స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

మీటర్ గిర్రున తిరుగుతోంది

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే 20 శాతం విద్యుత్ వినియోగం పెరిగింది. ఆగస్టు నెలలో వేసవిని తలపించేలా తీవ్రమైన ఉక్కు, ఎండ పరిస్థితులు ఏర్పడడంతో వాడకం అనూహ్యంగా పెరిగిపోయింది. కేటాయించిన దానికంటే అధికంగానే వినియోగం జరుగుతోంది. ఆగస్టు నెలలో నిర్వహణ నిమిత్తం కొన్ని థర్మల్‌స్టేషన్లలో సరఫరా ఆపివేస్తారు. అదే విధంగా డిస్కంకు మొత్తం 3,900 మెగావాట్లు రావాల్సి ఉండగా 800 తక్కువ వస్తోంది. అందులో పవన విద్యుత్ 2,500 మెగావాట్లకు బదులు 750 మాత్రమే వస్తోంది. ప్రస్తుతం సెప్టెంబర్ నెలలో కోటా పెరిగింది. వ్యవసాయ, గ్రామీణ సర్వీసులకు అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

- భిన్నమైన వాతావరణ పరిస్థితులు
- పెరుగుతున్న కరెంట్ వాడకం
- జిల్లాకు కేటాయించిన విద్యుత్ 19 ఎంయూ
- వినియోగిస్తున్నది 26 ఎంయూ
- సెప్టెంబర్‌లో పెరిగిన కోటా
- అంతరాయాలు ఉండకపోవచ్చు



చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో క్రమేణా సర్వీసులతో పాటు వినియోగం పెరుగుతోంది. దీనికి తోడు పరిశ్రమల వాడకం చెప్పాల్సిన పనిలేదు. భిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఆగస్టులో అనూహ్యంగా వాడకం పెరిగింది. జిల్లాకు ఆగస్టు నెలలో రోజువారీ కోటా 19–19.98 ఎంయూ ఉండగా, వాడకం 25.09–26.03 మిలియన్ యూనిట్లుగా ఉంది. గృహ అవసరాలు, అన్ని రంగాల్లో కేటాయించిన దాని కంటే దాదాపు 50 లక్షల యూనిట్లు వరకు అదనంగా వాడుతున్నారు. రోజు 33 కేవీ లైన్ ట్రిపింగ్, 13, 11 కేవీ లైన్ ట్రిపింగ్ 200 వరకు అవుతున్నాయి. దీంతో రోజు జిల్లాలో 30–35 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో సల్పంగా కోత విధించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ట్రాన్స్‌ఫార్మర్లను జిల్లాలోని 7 మరమ్మతు కేంద్రాల్లో సకాలంలో సిద్ధం చేసి ఇస్తున్నారు. గత నెలలో వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా వాటిని బాగు చేసి ఇచ్చారు. జిల్లాలో 19 గ్రామీణ ప్రాంతాల్లో 5 ఎంవీఏ సామర్థ్యం సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నారు. వీటి పనులు ఈనెలలోపు పూర్తి చేసి 62,320 హెచ్‌పీ సామర్థ్యంతో మెరుగైన సరఫరాను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇవి కాకుండా కొత్తగా నియోజకవర్గానికి 2 చొప్పున ఉమ్మడి జిల్లాకు 33 సబ్‌స్టేషన్లను మంజూరు చేశారు.

థర్మల్ స్టేషన్ నుంచి...

సెప్టెంబరు నెలలో విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా జిల్లాకు కోటా 23.27 ఎంయూ కాగా, వాడకం 19.98 ఎంయూగా ఉంది. దీంతో పాటు థర్మల్‌స్టేషన్ నుంచి విద్యుత్ అందించనున్నారు. పవన విద్యుత్ కూడా వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు అంటున్నారు.

ఉమ్మడి జిల్లా విద్యుత్ సమాచారం

గృహ సర్వీసులు	13,73,346
వాణిజ్యం	1,61,215
పరిశ్రమలు	21,175
ప్రభుత్వ సర్వీసులు	46,690
వ్యవసాయం	3,17,709
వీధిదీపాలు	17000
ఆర్‌డబ్ల్యూఎస్	13924
హెచ్‌టీ	1906
మొత్తం	19,52,790

అంతరాయం తగ్గుతుంది

ఈనెల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయి. ప్రస్తుతం కోటా పెరిగింది. వీటికి తోడు థర్మల్, పవన్ విద్యుత్ కేంద్రాల నుంచి సరఫరా పెరుగుతోంది. గత సంవత్సరం కంటే ప్రస్తుతం 20 శాతం వాడకం పెరిగింది. వ్యవసాయ, గ్రామీణ సర్వీసులకు అంతరాయం లేకుండా సరఫరా చేస్తాం

– కృష్ణారెడ్డి, ఎస్ఈ ట్రాన్స్‌కో



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.61,240
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,518
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.75,700
రిటైల్ వెండి గ్రాము రూ.77.70

పేకాట స్థావరంపై దాడి

– రూ.73 వేల నగదు స్వాధీనం, 10మంది అరెస్ట్

చంద్రగిరి: పేకాటాడుతున్న పేకాటరాయుళ్లతో పాటు వారి వద్ద నుంచి నగదును చంద్రగిరి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన ఆదివారం మండల పరిధిలోని నరసింగాపురంలో చోటు చేసుకుంది. సీఐ రాజశేఖర్ వివరాల మేరకు.. నరసింగాపురానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి తన ఇంట్లో గత కొంతకాలంగా అక్రమంగా పేకాట ఆడిస్తున్నట్లు పక్కా సమచారంతో దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఈ దాడుల్లో చంద్రగిరి, తిరుపతికి చెందిన సుమారు 10 మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.73,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో చట్ట వ్యతిరేఖ పనులకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

ఎస్వీయూ ప్రతిష్టకు భంగం కలిగించొద్దు

- రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్


ఎస్వీయూ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్

తిరుపతి సిటీ: విద్యారంగంలో ప్రముఖ స్థానం సంపాదించుకున్న ఎస్వీయూ ప్రతిష్టకు అవాస్తవిక కథనాలతో భంగం కలిగించవద్దని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహమ్మద్ హుస్సేన్ కోరారు. ఆదివారం ఆయన ఎస్వీయూలో మీడియాతో మాట్లాడారు. ఓ దిన పత్రికలో ఎస్వీయూలో 'ఉద్యోగాలకు గండం' అనే కథనం ప్రచురితమైందన్నారు. ఈ వార్త పూర్తిగా అవాస్తవమన్నారు. శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీలో రేషనలైజేషన్ వల్ల విభాగాల విలీనం, తద్వారా పోస్టులకు గండం ఏర్పడుతుందన్న విధంగా ఆ వార్త కట్టుకథగా ఉందన్నారు. విశ్వవిద్యాలయాల్లో రేషనలైజేషన్ ప్రక్రియ 2016–17లో ప్రారంభమైందని, గత ప్రభుత్వం జీఓ నంబర్ 30 ద్వారా ఎస్వీయూలో పోస్టులన్నీ రేషనలైజేషన్ ద్వారా తగ్గించి, 151 పోస్టులకు మాత్రమే పరిమితం చేసిన విషయాన్ని ఆయన ఆధారాలతో సహా ప్రస్తావించారు. 2017 జూలై 30న నోటిఫికేషన్ ఇచ్చిన విషయాన్ని దాచిపెట్టి అవాస్తవిక, నిరాధార ఆరోపణలతో కథనాలు రాయడం ఎస్వీయూ ప్రతిష్టకు భంగం కలిగించడమేనన్నారు. గత ప్రభుత్వం లీగల్ సమస్యలతో పోస్టులను భర్తీ చేయకుండా తీరని అన్యాయం చేసిందన్నారు. గతంలోనే శాఖల వారీగా, పోస్టుల వారీగా రేషనలైజేషన్ చేసిన చట్టప్రకారం, ఈ ప్రభుత్వం వచ్చాక రకరకాల కసరత్తులు చేసి, న్యాయపరమైన చిక్కులు పరిష్కరించి, ఎస్వీయూలో 250 పైచిలుకు పోస్టుల భర్తీకి సన్నద్ధమవుతున్న సమయంలో ఒక పత్రికలో అవాస్తవ కథనం ప్రచురించడం విడ్డూరమన్నారు. రేషనలైజేషన్ అనేది ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో, విద్యాశాఖలో నిరంతరం జరిగే ప్రక్రియ అన్నారు. ఎస్వీయూలో మాత్రమే చేపట్టిన ప్రక్రియగా అభివర్ణించడం ఆందోళన కలిగించేలా చేశారన్నారు. ఎస్వీయూ పారదర్శకత, ఆర్థిక క్రమశిక్షణ దిశగా అడుగులు వేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నేళ్లుగా ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయని తెలిపారు. ఎస్వీయూలో మాత్రమే రేషనలైజేషన్ పేరుతో జీవో 71 ద్వారా అన్యాయం చేస్తున్నారని చెప్పడం సమంజసం కాదన్నారు.

పారిశ్రామికవాడగా శ్రీకాళహస్తి


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అంతర్జాతీయ పారిశ్రామికవాడగా తీర్చిదిద్దుతున్న ఘనత ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం శ్రీకాళహస్తి మండలంలోని యార్లపూడి గ్రామంలో జరిగిన సిపాయి గ్రామ సందర్శన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పదుల సంఖ్యలో ప్రాజెక్టులను శ్రీకాళహస్తి నియోజవకర్గంలో ఏర్పాటయ్యేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మధు చొరవ తీసుకుని 20 వేల మందికి ఉపాధి కల్పించే అల్యూమినియం పరిశ్రమ, అపాచీ ఫ్యాక్టరీ, చైనా, అమెరికా, బ్రిటన్ దేశాలకు చెందిన కంపెనీలు తెప్పిస్తున్నారన్నారు. మరోసారి ఆయనను ప్రజలు అఖండ మెజార్టీతో గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యార్లపూడికి చెందిన హరిజనవాడ నాయకులు, తమ కుటుంబాలతో కలిసి మూకుమ్మడిగా టీడీపీని వదిలి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో రేవూరి పెంచలయ్య, పంద్ర రాజయ్య, పోలయ్య, గురవయ్య, సుధ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పేదలకు ఒక వరం


రోగులను పరీక్షిస్తున్న ఎమ్మెల్సీ, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: ఆరోగ్యశ్రీ పేదలకు ఒక వరంలాంటిదని ఎమ్మెల్సీ, తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం మండలంలోని పాతవీరాపురంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఖరీదైన వైద్యాన్ని కూడా పేదల ముంగిటకు తెచ్చేందుకు 108, 104, ఆరోగ్యశ్రీలాంటి వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వం పలు రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చకుండా సామాన్య ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ ద్వారా వందలాది జబ్బులను విస్తరించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. అనంతరం ఆయన 80 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, డాక్టర్ బాబు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తప్పెవరిది అమ్మా?

ఆడబిడ్డను కని డ్రైన్‌లో పడేసిన తల్లి

- ఏమీ ఎరుగనట్లు ఆస్పత్రిలో అడ్మిట్
- బిడ్డ చనిపోయిందంటూ బుకాయింపు
- తీరా ఆస్పత్రికి సురక్షితంగా చేరిన చిన్నారి
- బిడ్డకు వైద్యం అందించిన ఏరియా ఆస్పత్రి వైద్యులు
- ఇప్పుడు బిడ్డ కావాలంటూ తల్లి కొత్త నాటకం


తల్లి ప్రేమనే ఎంచుకున్నా..
నన్ను బాగా చూసుకుంటావని కలలుగన్నా
కానీ.. బొడ్డుతాడు తెగకముందే నన్ను
బలిపశువును చేశావు..
కన్నప్రేమను మరిచి కసాయిగా ప్రవర్తించావు..
నీ పరువు కోసం నన్ను మురుగు కాలువలో విసిరేశావు
నువ్వు చేసిన తప్పునకు నన్ను శిక్షిస్తావా అమ్మా?
అని ఆ తల్లిని నిగ్గదీసి అడుగుతున్నట్టుంది
కదూ..! ఈ ఫొటోలోని శిశువు!

పలమనేరు: పలమనేరులో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. ఓ మహిళ అప్పుడే పుట్టి.. కళ్లుకూడా తెరవని బిడ్డను మురుగు కాలువలో పడేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. దుర్గంధం భరించలేక.. క్రిమికీటకాలతో పోరాడలేక ఆ బిడ్డ గుక్కపట్టి ఏడ్వడం చూపరులను కలచివేసింది. ఈ హృదయ విదారక సంఘటన ఆదివారం వెలుగుజూసింది.

జరిగింది ఇలా.. :

కర్ణాటక రాష్ట్రం, ముళబాగిలు ఆవాస గ్రామంలోని అమరావతి(40)కి పైళ్లై ఇరవై ఏళ్లయ్యింది. 17 ఏళ్ల క్రితం భర్త మృతి చెందాడు. కుమార్తెకు పెళ్లి చేసింది. అయితే పట్టణానికి చెందిన 50 ఏళ్ల పెళ్లైన వ్యక్తితో పరిచయం పెంచుకుంది. సహజీవనం చేస్తూ గర్భం దాల్చింది. పట్టణంలో రహస్యంగా కాపురం పెట్టింది. శనివారం వేకువజామున అమరావతి స్థానిక ఏరియా ఆస్పత్రి సమీపంలోని కేవీఎస్ స్ట్రీట్‌లో ఆడబిడ్డను కని డ్రైన్‌లో పడేసింది. ఆపై తీవ్ర రక్తస్రావం కావడంతో ఆస్పత్రిలో చేరింది. జరిగిన విషయం తెలుసుకున్న వైద్యులు పసికందు ఎక్కడని ప్రశ్నించగా శిశువు మృతి చెందిందని వారిని నమ్మించింది. ఇలా ఉండగా కేవీఎస్ వీధిలో వాకింగ్ వెళ్లేవాళ్లు ఆదివారం ఉదయం డ్రైన్‌లో పసికందు కేకలు విని చలించిపోయారు. ఆ పసిగుడ్డును స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్‌యుగంధర్ పసికందును ఎన్‌బీయూ(న్యూబోర్న్ బేబీ యూనిట్)లో పెట్టి చికిత్సలందించారు. ఆపై మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో పంపించారు.

శిశు విహార్‌కు తరలింపు

ఈ విషయంపై స్థానిక వైద్యులు పోలీసులు, ఐసీడీఎస్ వారికి సమాచారాన్ని అందించారు. దీంతో అక్కడికెళ్లిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ వర్కర్, ఆశాలు కలిసి పాప ఆరోగ్యం కుదుటపడ్డాక ఐసీపీఎస్ ద్వారా తిరుపతి శిశు విహార్‌కు పంపనున్నట్టు తెలిపారు. మరోవైపు పోలీసులు సైతం బిడ్డ తల్లి, కారణమైన వారిపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు.

నా బిడ్డ నాకే కావాలి

'నేను ఆస్పత్రికి వస్తుండగా దారిలోనే కాన్పు అయ్యింది. బిడ్డ చనిపోయిందనుకుని డ్రైన్‌లో పడేశాను. బిడ్డ బతికే ఉందంటే నేనే తీసుకెళ్తా..' అంటూ అమరావతి కన్నీళ్లు పెట్టుకుంది. ఇలా ఉండగా ఆమె ప్రియుడు ఆస్పత్రిలో జరిగేదంతా చూస్తూ ఏమీ తెలియని వాడిలా అక్కడి నుంచి పరారైనట్టు తెలిసింది. ఏదేమైనా వారు చేసిన తప్పునకు పసిగుడ్డును బలిచేయడం మానవత్వానికే మచ్చలాంటిందని.. ఆ తల్లికి మనసేలా వచ్చిందంటూ మాట్లాడుకోవడం కనిపించింది.

అట్టహాసంగా పరుగు పందెం పోటీలు


పతకాలు, సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో నాయకులు


పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట స్పోర్ట్స్ ఫౌండేషన్ (ఎన్ఎస్ఎఫ్)వారి సారథ్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం సమీపంలో ఆదివారం పరుగుపందెం పోటీలు అట్టహాసంగా జరిగాయి. ఈ పోటీల్లో తిరుపతి జిల్లా నుంచే కాకుండా నెల్లూరు, వైఎస్సార్ కడప, కృష్ణా, శ్రీకాకుళం తదితర జిల్లాలకు చెందిన సుమారు 500 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎఫ్ వ్యవస్థాపకులు, జాతీయ పారా అథ్లెటిక్ క్రీడాకారులు మోమిడి లక్ష్మయ్య, చైర్మన్ కలికి సుదీప్ రెడ్డి, సభ్యుల సారథ్యంలో 6, 8, 10, 12,14,18 ఏళ్ల వయసు కలిగిన పిల్లలకు 60, 80, 100, 200, 300, 600 మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకులు పోట్లాపూడి రాజేష్, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం వేమా సుధాకర్, నెల్లూరుపల్లి నాగరాజు, డాక్టర్ గోపీనాథ్ జెండా ఊపి ప్రారంభించారు.ఆరు విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లను వైఎస్సార్‌సీపీ అర్బన్ జేసీఎస్ కన్వీనర్ చదలవాడ కుమార్, నాయకులు ప్రకాష్ నాయుడు, సూళ్లూరుపేట రైల్వే అధికారి అలెగ్జాండర్, ఎన్ఎస్ఎఫ్ నిర్వాహకులు తదితరులు అందించారు.

టీటీడీ బోర్డు సభ్యుల ప్రమాణస్వీకారం


పాలకమండలి సభ్యులు శేషుబాబు, వెంకట సతీష్‌కుమార్, డాక్టర్ శంకర్, సామినేని ఉదయభాను, అమోల్ కాలేను శ్రీవారి చిత్రపటంతో సత్కరిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా ఆదివారం శేషుబాబు, వెంకట సతీష్ కుమార్, డాక్టర్ శంకర్, సామినేని ఉదయభాను, అమోల్ కాలే తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలో స్వామివారి సన్నిధిలో వీరి చేత జేఈఓ వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం వీరికి జేఈఓ శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ ఈఓలు లోకనాథం, గోవిందరాజన్ పాల్గొన్నారు.